సాక్షి
నంద్యాల
బుధవారం । 12 । జూన్ । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల అన్నదాన పథకానికి మంగళవారం నంద్యాలకు చెందిన గోరంట్ల రాజశేఖరరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు.



నందీశ్వరుడికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరుడికి, బయలువీరభద్ర స్వామికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు పూజలు నిర్వహించారు.



సర్పం..అప్రమత్తం!

వర్షాకాలం కావడంతో పాములు బయటకు వచ్చి సంచరిస్తుంటాయి. ఏ మాత్రం ఆదమరిచినా అవి కాటు వేసే ప్రమాదం ఉంది. అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు పాఠశాలల పునఃప్రారంభం

కర్నూలు(సెంట్రల్): ఈనెల 12కు బదులుగా 13వ తేదీన పాఠశాలను పునఃప్రారంభించాలని జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లను డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. పాఠశాలల ఆవరణలు, తరగతి గదులను, మధ్యాహ్న భోజన వంట పాత్రలను శుభ్రం చేయించి 13వ తేదీ నాటికి సిద్ధంగా ఉంచాలని ఆయన సూచించారు.

శ్రీశైలంలో 34.1482 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 34.1482 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ సుంకేసుల ప్రాజెక్ట్ నుంచి సోమవారం నుంచి మంగళవారం నాటికి 0.4302 టీఎంసీల నీరు జలాశయంలోకి వచ్చి చేరడంతో డ్యాం నీటిమట్టం 809.70 అడుగులకు చేరుకుంది.

జీడీపీకి 1,400 క్యూసెక్కుల వరద నీరు

గోనెగండ్ల: రుతుపవనాల ప్రభావంతో మండలంలో వారం రోజులుగా తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు వరద నీరు వచ్చి చేరుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ ఆలీ మంగళవారం తెలిపారు. జీడీపీలో నాలుగు రోజుల క్రితం 0.7 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు దాదాపు 1,400 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో మంగళవారం ఉదయానికి 0.8 టీఎంసీలకు చేరిందన్నారు. కాగా గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు 4.5 టీఎంసీల నీరు నిల్వ చేసే సామర్థ్యం ఉంది.

సుంకేసులకు 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని మంగళవారం డ్యాం జేఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. రిజర్వాయర్ సామర్థ్యం 1.200 టీఎంసీ ఉండగా ప్రస్తుతం 0.554 టీఎంసీ నీటి నిల్వ ఉందన్నారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ తక్కువగా ఉండటంతో అవుట్‌ఫ్లో నిలిపివేశామన్నారు.

సీఎం ప్రమాణస్వీకారం వీక్షణకు ప్రత్యేక స్క్రీన్లు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం చేయనున్న నేపథ్యంలో జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం కోసం ఎల్‌సీడీలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ప్రారంభమై ప్రమాణ స్వీకారం ముగిసే వరకు కొనసాగించాలన్నారు. ఇదిలాఉంటే చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సులు మంగళవారం సాయంత్రం అమరావతికి తరలి వెళ్లాయి. ఒక్కో నియోజకవర్గానికి 130 వరకు వీవీపీ, 30 వీవీఐపీ పాసులతోపాటు కారు పార్కింగ్‌కు మరో 700 పాసులను జారీ చేశారు.

18 మండలాల్లో వర్షం

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లాలోని 18 మండలాల్లో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. చిప్పగిరిలో 29.8 ఎంఎం, ఆలూరులో 17.4 ఎంఎం, కృష్ణగిరిలో 13.8 ఎంఎం, దేవనకొండ 11.2 ఎంఎం, ఆస్పరిలో 10.8 ఎంఎం, ఎమ్మిగనూరులో 9.8 ఎంఎం, వెల్దుర్తిలో 9.2 ఎంఎం ప్రకారం వర్షాలు కురిశాయి. ఆదోని, హాలహర్వి, మద్దికెర, హొళగుంద, పత్తికొండ, తుగ్గలి, గోనెగండ్ల, నందవరం, కోడుమూరు, కౌతాళం, పెద్దకడబూరు మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 ఎంఎం కాగా ఇప్పటి వరకు 88.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. రానున్న నాలుగైదు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు పేర్కొన్నారు.

పద్మ అవార్డులకు ప్రతిపాదనల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): భారత హోమ్ మంత్రిత్వ శాఖ పద్మ అవార్డుల కోసం అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు/ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి పీపీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, విద్య, సాహితి, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజాసంబంధాలు, పౌరసేవలు, తయారీ, సేవా రంగాల్లో ఉత్తమ సేవలు/ప్రతిభ కనపరిచిన వారి నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హులైన వారు http://awardsr.gov.inలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నిర్ణీత ఫార్మాట్‌ను కల్లూరు ఎస్టేట్‌లోని సెట్కూరు కార్యాలయంలో జులై 10లోగా సమర్పించాలని సూచించారు.

లక్ష్యం ‘సెట్’చేసుకొని!

- ఇంజినీరింగ్ టాప్-3లో జిల్లా విద్యార్థులు
- 2, 3, 7 ర్యాంకు కైవసం
- అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో ఉత్తమ ర్యాంకులు
- ఇంజినీరింగ్‌లో 17,690 మంది విద్యార్థులకు గానూ 16,597 ఉత్తీర్ణత
- అగ్రికల్చర్, ఫార్మసీల్లో 9,517 మంది విద్యార్థులకు గానూ 9,202 మంది అర్హత





కర్నూలు(సెంట్రల్): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు టాప్ లేపారు. ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో టాప్-3లో ముగ్గురు విద్యార్థులు నిలిచారు. కర్నూలుకు చెందిన సాయియశ్వంత్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకును సాధించారు. అలాగే ఆదోనికి చెందిన బి.సందేశ్ 3వ ర్యాంకు, కర్నూలుకు చెందిన గొల్ల లేఖహర్ష 7వ ర్యాంకు సాధించారు. అలాగే అగ్రికల్చర్ విభాగంలో కర్నూలుకు చెందిన మోక్షశ్రీ 34వ ర్యాంకు, ఫణిధర్‌రెడ్డి 69వ ర్యాంకు, మహ్మద్ ఇర్ఫాన్ 82వ ర్యాంకు సాధించారు. నంద్యాలకు చెందిన చలమరెడ్డి 23వ ర్యాంకు, హేమవర్షిణి 42వ ర్యాంకు సాధించారు. కాకినాడ జేఎన్‌టీయూ నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ ఫలితాలను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి ఇంజినీరింగ్, ఫార్మసీలో మొత్తం 17,690 మందికి విద్యార్థులకు గానూ 16,597 మంది ఉత్తీర్ణత సాధించారు. అగ్రికల్చర్-ఫార్మసీ విభాగంలో 9,517 మందికి గానూ 9,202 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇందులో ఇంజినీరింగ్‌కు సంబంధించి కర్నూలు జిల్లాకు చెందిన 12,224 మంది పరీక్షకు హాజరవ్వగా 11,415 మంది, నంద్యాల జిల్లాకు సంబంధించి 5,466 మంది పరీక్షకు హాజరవ్వగా 5,181 మంది, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగంలో కర్నూలు జిల్లాకు సంబంధించి 7,057 మందికి గానూ 6,807 మంది, నంద్యాలకు జిల్లాకు సంబంధించి 2,517 మంది పరీక్షకు హాజరవ్వగా 2,395 మంది ఉత్తీర్ణత సాధించారు. కాగా ర్యాంకర్లలో చాలా మంది నీట్‌లోనూ ర్యాంక్‌లు సాధించడంతో మెడిసిన్ వైపు మొగ్గు చూపుతున్నారు.

విద్యార్థి పేరు: ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి
తల్లిదండ్రులు : రామేశ్వరరెడ్డి
స్వస్థలం: మారుతీ నగర్, కర్నూలు
ర్యాంకు : 2
లక్ష్యం : ఐఐటీ బాంబే లక్ష్యంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్



విద్యార్థి పేరు : బి.సందేశ్‌రెడ్డి
తల్లిదండ్రులు : రామసుబ్బారెడ్డి, రాజేశ్వరి
స్వస్థలం: ఆదోని
ర్యాంకు : 3
లక్ష్యం : రూర్కెల ఐఐటీ ఇంజినీరింగ్



విద్యార్థి పేరు: గొల్ల లేఖహర్ష
తండ్రి: సూర్యకుమార్
స్వస్థలం: కర్నూలు
ర్యాంకు: 7



గురుకుల విద్యార్థుల ప్రతిభ

కల్లూరు: మండలంలోని చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ-మెడికల్ అకాడమీ విద్యార్థులు మంగళవారం విడుదలైన ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఇంటర్మీడియెట్‌తో పాటు ఇక్కడ ఏపీఈఏపీ సెట్, నీట్, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్ పరీక్షలకు శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందిన కె.గణేష్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 1,060 ర్యాంక్, మాసపోగు శ్రీధర్ 1,587, ఎం.సాయి 1,736 ర్యాంక్‌తో పాటు మరో 55 మంది ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో కె.రాఘుసాయి 2,257, బి.గురుప్రసాద్ 2,502, కె.అనిల్ నాయక్ 2,766 ర్యాంక్‌తో పాటు మరో 70 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు.


కె.గణేష్


ఎం. శ్రీధర్


ఎం. సాయి


కె.రఘుసాయి


గురుప్రసాద్


అనిల్ నాయక్

విద్యార్థి పేరు : చిట్టి ఆశిష్ చలమారెడ్డి
తల్లిదండ్రులు : జనార్దన్ రెడ్డి, నాగజ్యోతి
స్వస్థలం: ఎర్రగుడూరు, పాములపాడు మండలం
ర్యాంకు : 23
లక్ష్యం : మెడిసిన్



పేరు : సిద్ధార్థరెడ్డి
ర్యాంకు : 27
స్వస్థలం : కర్నూలు
తల్లిదండ్రులు : అమరేందర్‌రెడ్డి
లక్ష్యం : ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం



పేరు: ఆర్ శ్రీహరినాథ్
ర్యాంకు: 33
స్వస్థలం: మునెప్పనగర్, ఎమ్మిగనూరు
తల్లిదండ్రులు: కృష్ణవేణి, ఆర్ మల్లికార్జునప్ప,
లక్ష్యం: ఏరోనాటికల్ ఇంజినీర్



పేరు : ఎస్.మోక్షశ్రీ
ర్యాంకు : 34
తల్లిదండ్రులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ హేమలత
స్వస్థలం : కర్నూలు, కృష్ణనగర్
లక్ష్యం : నీట్‌లో 198వ ర్యాంకు వచ్చింది. ఢిల్లీ ఎయిమ్స్, జిప్‌మర్ పాండిచ్చేరిలో చదవడం



పేరు : హేమవర్షిణి
ర్యాంకు : 42
స్వస్థలం : నంద్యాల, గోస్పాడు, నెహ్రూ నగర్
తల్లిదండ్రులు : శైలజ, శివారెడ్డి
లక్ష్యం : డాక్టర్



పేరు : మహ్మద్ ఇర్ఫాన్
తల్లిదండ్రులు : అబ్దుల్ మజీద్, షాలీబీ
ర్యాంకు : 82
స్వస్థలం : కర్నూలు, బాలాజీ నగర్
లక్ష్యం : మంచి వైద్యుడై ప్రజలకు సేవ చేయడం



పేరు : జక్కల నాగవంశీకృష్ణ
తల్లిదండ్రులు- బాలయ్య, వసుంధర
ర్యాంకు : 122
స్వస్థలం : నంద్యాల
లక్ష్యం: ఐఐటీ రూర్కెలలో సీటు సంపాదించడం



పేరు : మోహన్‌కృష్ణ
ర్యాంకు -136
స్వస్థలం : కొలిమిగుండ్ల మండలం,తిమ్మనాయినిపేట
తల్లిదండ్రులు : బోయ పాపయ్యగారి పుల్లయ్య, మాధవి
లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కావడం



పేరు: ఆర్ వికాష్‌రెడ్డి
ర్యాంకు : 141
స్వస్థలం : గాంధీనగర్, ఎమ్మిగనూరు
తల్లిదండ్రులు : యుగంధర్‌రెడ్డి, అనురాధ
లక్ష్యం: డాక్టర్



పేరు : పూజిత జిల్లెల
ర్యాంకు : 163
స్వస్థలం : భూమనాగిరెడ్డి పల్లె, రుద్రవరం మండలం
తల్లిదండ్రులు : దేవదత్త ప్రవీణ్‌కుమార్, ఉమామహేశ్వరి
లక్ష్యం: డాక్టర్



పేరు: శ్రీవర్ధిని
ర్యాంకు : 209
స్వస్థలం : ఆదోని పట్టణం
తల్లిదండ్రులు : సి.ఆనంద్, సుశీలమ్మ
లక్ష్యం: డాక్టర్



పేరు: ఉపశ్రీ
ర్యాంకు : 247
స్వస్థలం : నంద్యాల
తల్లిదండ్రులు : చిన్న హుసేన్‌రెడ్డి, రాధాకృష్ణమ్మ
లక్ష్యం: డాక్టర్



విద్యార్థి పేరు: షేక్ సుమయ
తల్లిదండ్రులు : షేక్ మాలిక్ బాషా, జుబేదా
స్వస్థలం: నన్నూరు, ఓర్వకల్లు మండలం
ర్యాంకు : 199
లక్ష్యం : గైనకాలజిస్టు



విద్యార్థి పేరు: ఎం.షేక్ సానియా అఫ్రా
ర్యాంక్: 238
తల్లిదండ్రులు: ఎం.దాదాపీర్, ఖాలీమూనిసా
స్వస్థలం: గీతానగర్, కర్నూలు
లక్ష్యం: చిన్నపిల్లల డాక్టర్



విద్యార్థి పేరు : కౌలుట్ల తన్మయి
తల్లిదండ్రులు : కౌలుట్ల శ్రీనివాసులు, సంధ్య
స్వస్థలం: పాములపాడు
ర్యాంకు : 300
లక్ష్యం : మెడిసిన్ చేయడం



విద్యార్థి పేరు : బుజాల పవిత్ర
తల్లిదండ్రులు : బుజాల శివరామిరెడ్డి, తులశమ్మ
స్వస్థలం: శింగనపల్లె, అవుకు మండలం
ర్యాంకు : 350



పేరు : వడ్డు హేమంత్ రెడ్డి
ర్యాంకు : 436
స్వస్థలం : పెనరవాయి, గడివేముల మండలం
తల్లిదండ్రులు : కృష్ణారెడ్డి, లావణ్య
లక్ష్యం: డాక్టర్



పేరు: సంజామల వెంకట బాలాజీ
ర్యాంకు : 470
స్వస్థలం : ప్యాపిలి
తల్లిదండ్రులు: వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీదేవి
లక్ష్యం: డాక్టర్



విద్యార్థి పేరు : జి.మోక్షిత్ రంగనాథ్‌రెడ్డి
తల్లిదండ్రులు : గంగవరపు రామాంజనేయరెడ్డి, సరస్వతి
స్వస్థలం: గాజులపల్లె, మహానంది మండలం
ర్యాంకు : 520
లక్ష్యం : ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో రాణించడం



స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలి

- పీసీ పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ మీటింగ్‌లో ఆర్డీఓ శేషిరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): సబ్ డిస్ట్రిక్ట్‌లో ఉండే స్కానింగ్ కేంద్రాలను అధికారులు తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని ఆర్డీఓ శేషిరెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో పీసీ పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సబ్ డిస్ట్రిక్ట్‌లో కొత్తగా రిజిస్ట్రేషన్ కోసం, రెన్యువల్స్ కోసం దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ కేంద్రాలను ప్రోగ్రామ్ అధికారులు తనిఖీ చేసి అక్కడి పత్రాలన్నీ సక్రమంగా ఉన్నాయో లేదా అన్న రిపోర్టును జిల్లా స్థాయి కమిటీకి తదుపరి ఆమోదం కోసం సమర్పించాలన్నారు. డివిజన్‌లో ఉన్న స్కానింగ్ కేంద్రాలను సబ్ డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యులచే ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ తీర్మానం చేసిందన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ గురించి ఎవ్వరికీ మాటల రూపంలో, చేతల రూపంలో, సైగల రూపంలో చెప్పరాదన్నారు. స్కానింగ్‌కు వచ్చినప్పుడు వారికి లింగ ఎంపిక, నిర్ధారణ గురించి చెప్పకూడదని తెలిపారు. అలా చెబితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పీసీ పీఎన్‌డీటీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వై. నాగప్రసాద్, గైనకాలజిస్టు డాక్టర్ కిరణ్మయి, రెండో పట్టణ సీఐ బిందుమాధవి, డెమో ప్రమీలాదేవి, ఎన్‌జీవో రాయపాటి శ్రీనివాసులు, మద్దిలేటి, హెచ్‌ఈఈవో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖరరెడ్డి, పీఎన్‌డీటీ ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శేషిరెడ్డి

కృష్ణా జలాల్లో గుర్రపుడెక్క


సంగమేశ్వరం వద్దకు చేరుతున్న గుర్రపు డెక్క

కొత్తపల్లి: వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా సంగమేశ్వరం వద్ద కృష్ణా జలాలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా వరద నీరు వస్తుండడంతో సప్తనదుల సంగమ ప్రాంతంలోని సంగమేశ్వరం వద్ద కృష్ణాజలాలు 4 అడుగుల మేర పెరిగాయి. కాగా నదీజలాలతో పాటు గుర్రపు డెక్క పెరుగుతుండటంతో సంగమేశ్వరాలయాన్ని సందర్శించేందుకు వచ్చే భక్తుల మరబోట్లకు, మత్స్యకారుల బోట్లకు ఆటంకం కలుగుతోంది.

యోగాతో ఆరోగ్యం

కర్నూలు (టౌన్): క్రమం తప్పకుండా యోగ చేస్తే ఆరోగ్యంతో పాటు ఆనందం కలుగుతుందని జాతీయ యోగ సంఘం కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నగరపాలక సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న వేసవి యోగ శిక్షణ శిబిరం ముగిసింది. అంతకు ముందు వారు మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు యోగ సాధన ద్వారా ఒత్తిడిని అధిగమించి చదువులో రాణిస్తారన్నారు. తర్వాత చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, యోగ శిక్షకులు మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఎన్నికలు విజయవంతం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న అధికారులు

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: అందరి సహకారంతో ఎన్నికల ప్రక్రియ విజయవంతమైందని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సార్వత్రిక ఎన్నికలు - 2024 విజయవంత ప్రక్రియపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డితో కలిసి జిల్లాధికారులు, రిటర్నింగ్ అధికారులు, సంబంధిత సిబ్బందితో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కృషి చేసిన పోలీస్ యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ మొదటిసారి అయినప్పటికీ అందరి సహకారం, సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. అంతకుముందు జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు, బనగానపల్లె, నందికొట్కూరు రిటర్నింగ్ అధికారులు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సుధారాణి, కామేశ్వరరావు, ఎం.దాసు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, భూగర్భ గనుల శాఖ ఏడీ రామచంద్ర, డీపీఓ మంజులవాణి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ జెహారున్నిసా బేగం తదితరులు ఎన్నికల విధుల్లో ఎదుర్కొన్న అనుభవాలను వివరించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులును జిల్లా అధికారుల బృందం శాలువా కప్పి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

అదనపు ఓపీ డిజిటల్ కౌంటర్ ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్థానిక పెద్దాస్పత్రిలో అదరనపు ఈ-డిజిటల్ ఓపీ కౌంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. దీంతో ఉదయం 10.30 గంటల్లోపు 80 శాతం ఓపీ టికెట్లు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ఆసుపత్రికి రోగులు వస్తున్నారన్నారు. వారి సౌకర్యార్థం మరో ఈ-డిజిటల్ కౌంటర్‌ను ప్రారంభించామన్నారు. ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థుల సేవల వల్ల ఈ-డిజిటల్ ఓపీ కౌంటర్ సక్సెస్ అయ్యిందన్నారు. రోగులకు ఆస్పత్రిలో ఏదైనా అవసరమైన సమాచారం ఇచ్చి సాయం చేసేందుకు ఎన్ఎస్ఎస్ తరపున కానీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీ విద్యార్థులు కానీ స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. త్వరలో మహిళలకు కూడా మరో రెండు ఓపీ కౌంటర్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ ఉన్నారు.


ఈ-డిజిటల్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డిబార్

కర్నూలు(సెంట్రల్) : రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న 2,6 సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం ఐదుగురు డిబార్ అయ్యారు. కర్నూలు సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో బనగానపల్లె విశ్వేశ్వర డిగ్రీ కాలేజీలో ఒక్కొక్కరు చొప్పున, పీఎస్‌సీ, కేవీఎస్‌సీ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ముగ్గురు మొత్తం ఐదుగురు డిబార్ అయ్యారు. కాగా సెమిస్టర్–2 పరీక్షలకు 88 శాతం, సెమిస్టర్ – 6 పరీక్షలకు 89 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు.

పండ్ల తోటలతో సుస్థిర ఆదాయం



పూడిచెర్లలో పండ్ల మొక్కలను పరిశీలిస్తున్న అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకం ద్వారా సుస్థిర ఆదాయం పొందవచ్చని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా మంగళవారం పూడిచెర్ల గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అక్కడి నుంచి గ్రామానికి చెందిన మహిళా రైతు లోకేశ్వరమ్మ ఎకరా పొలంలో నాటిన 60 నేరేడు మొక్కలు, అరుణమ్మ 2 ఎకరాల్లో నాటిన 200 చీని మొక్కలను పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం కాల్వబుగ్గ వద్ద డ్వామా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. మొక్క కొనుగోలుతో పాటు మూడేళ్ల నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. మొక్కలు కాపుదశకు వచ్చేవరకు అంతర పంటలను సాగు చేసుకునే వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మండలంలో జాబ్ కలిగి, 5 ఎకరాలు ఉన్న రైతులను గుర్తించి పండ్ల తోటలపై అవగాహన కల్పించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. రైతులకు అవసరమైన మొక్కలను కాల్వబుగ్గ నర్సరీలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రధానంగా చిన్న, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ వెంకటభూపాల్, టీఏలు శాంతి, ఐజయ్య పాల్గొన్నారు.

సర్పం..అప్రమత్తం

- తొలకరి వర్షాలకు బయటకు వస్తున్న సర్పాలు
- ఇప్పటికే పలువురికి పాముకాటు
- పొలాలు, పొదల్లో జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పాముకాటు మందులు



కర్నూలు(హాస్పిటల్): మండే ఎండల నుంచి ఉపశమనం లభించింది. జిల్లాలో తొలకరి వర్షాలు మొదలయ్యాయి. ఫలితంగా వాతావరణం చల్లబడింది. ఇదే సమయంలో భూమిలో నుంచి పాములు బయటకు వస్తున్నాయి. అలా వచ్చిన పాములు పొదల్లో, రాళ్ల, గుట్టల్లో దాక్కుంటున్నాయి. అటుగా వెళ్లిన వారు ఆదమరిస్తే కాటేస్తున్నాయి. ఇందులో సాధారణ సర్పాలైతే ఏమీకాదు. విష సర్పాలైతే మాత్రం ప్రాణాల మీదకు వచ్చినట్లే. ఇప్పటికే జిల్లాలో పలువురు పాముకాట్లకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రోజూ ఎక్కడో ఒక చోట వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో రైతులు పొలం పనుల్లో బిజీ అవుతున్నారు. ఇదే తరుణంలో భూమి పొరలు, రాళ్ల, రప్పల్లో దాక్కున్న పాములు, తేళ్లు బయటకు వస్తున్నాయి. అటుగా వెళ్తున్న వారు తమపై దాడి చేస్తారేమోనని అవి ముందుగానే కాటేసి వెళ్లిపోతున్నాయి. ఇప్పటికే జిల్లాలో పలువురు పాముకాటుకు గురై ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. ఇటీవల రాయలసీమ యూనివర్సిటీలో జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో ఓ ఉద్యోగికి తేలు కాటు వేసింది. ఈ వారంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఆవరణలో పెద్ద నాగుపాము కనిపించింది. వైద్య విద్యార్థులుండే వసతి గృహం వద్ద కట్ల పాము కనిపించడంతో సిబ్బంది దానిని చంపేశారు. ఈ మేరకు జిల్లాలో పాముకాటుకు గురై గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, పట్టణాల్లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చికిత్స కోసం వస్తున్నారు. సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ అనే పాముకాటు ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచారు. పరిస్థితి విషమించిన వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏఎంసీలో ఉంచి చికిత్స చేస్తున్నారు. అయితే చాలా మంది పాము కాటు వేసిన వెంటనే ఆందోళనకు గురికావడం, ప్రథమ చికిత్సపై అవగాహన లేకపోవడం, ఆసుపత్రికి తరలించడంలో ఆలస్యం కావడం వంటి కారణాలతో విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు.

పాములు తిరిగే చోటు

- ధాన్యపు గాదెలు, గడ్డివాములు ఉండే చోట ఎలుకలు తిరుగుతుంటాయి. తడిగా ఉండే చోట కప్పలు చేరతాయి. వాటిని తినేందుకు పాములు వస్తాయి.
- దుంగలు, కట్టెలు కదిలించినప్పుడు జాగ్రత్తగా ఉండాలి. వాటి మధ్యలో పాములు, తేళ్లు ఉండే ప్రమాదం ఉంది. పిడకల మధ్య కూడా విష పురుగులు చేరతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ముఖ్యంగా రాత్రిపూట మోటారు వేయడానికి, నీరు పెట్టడానికి వెళ్లేటప్పుడు విధిగా టార్చిలైట్ ఉపయోగించాలి. ఒక్కోసారి మోటార్‌షెడ్‌లో, స్టార్టర్ దగ్గర గూడు లాంటి ప్రదేశాల్లో పాములు నక్కి ఉండొచ్చు.
- చేతిలో కర్రతో చప్పుడు చేస్తూ వెళ్లాలి పాదరక్షలు ధరించాలి. వీలైతే మోకాలు వరకు ఉండే బూట్లు వేసుకోవాలి.

పాములన్నీ విషపూరితం కాదు

- త్రాచు పాము, కట్ల పాము వంటి 15 శాతం పాములే ప్రమాదకరమైనవి.
- అన్ని పాముకాట్లు ప్రమాదకరమైనవి కాదు. సాధారణ చికిత్స తీసుకుంటే వాటి గాయాలు నయం అవుతాయి.
- పాము విషం కన్నా చాలా మంది షాక్, ఆందోళనతోనే ప్రాణం మీదకు తెచ్చుకుంటారు.

విషసర్పం కాటు–లక్షణాలు

- సాధారణ త్రాచు విష ప్రభావం శరీరంలో ప్రవేశానికి కొంత వ్యవధి తీసుకుంటుంది. నల్లత్రాచు (కింగ్‌కోబ్రా) విషం ప్రభావం చాలా త్వరగా కనిపించి ప్రాణాంతకంగా ఉంటుంది. కట్లపాము కాటు బాధ ఒకరకమైతే, రక్తపింజర విష లక్షణాలు మరో రకంగా ఉంటాయి.
- సాధారణంగా విష సర్పాలు కాటు వేసినప్పుడు వాటి కోరల గాయం స్పష్టంగా కనిపించి, నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు, బొంగురుపోవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

పాము కరిచిన వెంటనే ఇలా చేయకూడదు

- పాముకాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతో పాటు విషం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు. అలా చేయవద్దు. ఒక్కోసారి పాముకాటు కన్నా ఈ గాయం ప్రమాదకరంగా మారవచ్చు. శాస్త్రీయమైన చికిత్స సాధ్యమైనంత త్వరగా అందించడమే ఉత్తమం.
- మరికొందరు సినిమా హీరోలా పాము కరిచిన ప్రదేశంలో గాటుపెట్టి నోటితో విషం పీల్చేస్తామంటారు. పాముకాటు వేయగానే విషం రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు, గుండెకు చేరుకుంటుంది. కాబట్టి దీనివల్ల ప్రయోజనం ఉండదు. ఒక్కోసారి హాని కలగవచ్చు కూడా.


పాము కాటును బట్టి చికిత్స

పాము గాట్లను బట్టి కాటేసింది విషపు పామా కాదా నిర్ధారణ అవుతుంది. పాముకాటులో రెండు కోరల మధ్య దూరం, లోతును బట్టి వైద్యులకు తెలుస్తుంది. పాము కరిచిన చోట నీలంగా, వంగపండు రంగులా మారుతుంది. ఉబ్బులా, లావుగా అవుతుంది. ఈ లక్షణాలను బట్టి విషపు పాముగా గుర్తించవచ్చు. విషపు పాము కాటుకు ప్రాథమిక చికిత్సగా ఐవీ ఫ్లూయిడ్స్ పెట్టి అందులో నుంచి ఏఎస్‌వీ ఇంజెక్షన్ ఇస్తారు. ఒక్కోసారి ఈ ఇంజెక్షన్ అందరికీ పడదు. కావున డోస్ అడ్జస్ట్ చేస్తూ ఇవ్వాల్సి ఉంటుంది. పాము కరిచిన వ్యక్తికి నాడి బలహీనమవడం, బీపీ తగ్గిపోతుండటం, విపరీతంగా చెమటలు పట్టడం, మగతగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలి.

పాము కరవగానే ఇలా చేయాలి

- పాము కరవగానే భయాందోళనకు గురిగాకుండా ధైర్యంగా ఉండాలి. బంధుమిత్రులు కూడా వారికి ధైర్యం చెప్పాలి.
- పక్కనున్న వారు ఆ పాము విషసర్పమో కాదో గుర్తించే ప్రయత్నం చేయాలి. దాని వల్ల చికిత్స మరింత ఖచ్చితంగా అందజేయవచ్చు.
- నాటు వైద్యం, మంత్రతంత్రాల జోలికి వెళ్లకుండా సాధ్యమైనంత తొందరగా దగ్గరలోని ఆసుపత్రికి రోగిని నడిపించకుండా తీసుకెళ్లాలి.

అన్ని ఆసుపత్రుల్లో మందులున్నాయి



జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పాముకాటు మందులను అందుబాటులో ఉంచాము. సాధారణంగా ఈ మందు ఎక్కువ రోజులు నిల్వ ఉండదు. కాబట్టి తక్కువ పరిమాణంలో ఆయా ఆసుపత్రుల్లో నిల్వ ఉంచుతాము. మందులు అయిపోయిన వెంటనే ఇండెంట్ పెడితే సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి తెచ్చుకోవచ్చు. అత్యవసరమైతే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధుల నుంచి కొనుగోలు చేయవచ్చు. –డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

నాటు మందు వాడకం సరికాదు



చాలా ప్రాంతాల్లో పాముకాటుకు స్థానికంగా నాటుమందు వాడుతుంటారు. ఇది మరింత ప్రమాదకరం. పాము కాటు వేసిన చోట శుభ్రం చేసి ప్రథమ చికిత్స చేయించాలి. నాగుపాము, కట్లపాము, రక్తపింజరి ప్రమాదకరం. పాము కుట్టిన చోట నీలం, ఎరుపురంగులో మారుతుంది. కట్లపాము, నాగుపాము కాటువేస్తే అది నాడీవ్యవస్థపై ప్రభావం చూపి శ్వాసతీసుకోకుండా చేసి కోమాలోకి రోగి వెళ్తాడు. కళ్లు సరిగ్గా కనిపించవు. నోట్లో నుంచి నురగ వస్తుంది. పాము కాటు వేయగానే సాధ్యమైనంత త్వరగా ప్రథమ చికిత్స చేయించి ఆసుపత్రిలో చేర్చాలి. –డాక్టర్ ఎస్. సరయూరెడ్డి, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

టీడీపీ నేతల దురాగతం

- షాదీఖానా ఫలకం తొలగింపు



ఫలకాన్ని తొలగిస్తున్న యూనస్ అతని సహచరుడు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని షాదీఖానా వద్ద ఏర్పాటు చేసిన ఇనుప ఫలకాన్ని మంగళవారం తెలుగుదేశం పార్టీ నేత యూనస్ అతని సహచరులు కలిసి తొలగించేశారు. ఏళ్ల క్రితం నిర్మించిన షాదీఖానా శిథిలావస్థకు చేరుకోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.రెండు కోట్లతో పునరుద్ధరణకు చర్యలు తీసుకుంది. నిధులు కాస్త ఆలస్యం కావడంతో అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తన స్వంత నిధులను కాంట్రాక్టర్‌కు ఇచ్చి త్వరగా పనులు పూర్తి చేయించారు. కాగా ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాట్లు చేసిన ఇనుప ఫలకాన్ని టీడీపీ నేతలు తొలగించేశారు. యూనిస్ ఎన్నికల ముందే వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరడం గమనార్హం. కాగా వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు సయ్యద్ మీర్ టీడీపీ నేతల దుశ్చర్యను ఖండించారు.

గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్)/నంద్యాల(న్యూటౌన్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలో పార్ట్ టైం (తాత్కాలిక) ఉపాధ్యాయులుగా విభిన్న స్థాయిల్లో (జేఎల్/ పీజీటీ/ టీజీటీ) పని చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఈఎస్ కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి తెలిపారు. జేఎల్ 07 (తెలుగు 01, మ్యాథ్స్ 01, ఫిజిక్స్ 02, కెమిస్ట్రీ 02, సివిక్స్ 01) టీజీటీ 05 (హిందీ 01, తెలుగు 01, ఫిజికల్ సైన్స్ 01, బయో సైన్స్ 02), పీడీ/ పీఈటీ 04 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆమె మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలికల పాఠశాలల్లోని ఖాళీలను మహిళా అభ్యర్థులతో, బాలుర పాఠశాలల్లో పురుష అభ్యర్థులతోనే భర్తీ చేస్తామన్నారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా పీజీ, బీఎడ్‌లో కనీసం ద్వితీయ శ్రేణి ఉత్తీర్ణత, టెట్‌లో అర్హత కలిగి ఉండాలన్నారు. పీడీ/ పీఈటీలకు తప్పనిసరిగా పీజీ, బీపీఈడీలో కనీసం ద్వితీయ శ్రేణి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీలోగా కార్యాలయ పనివేళల్లో అందజేయాలన్నారు. అందులో అర్హులైన వారికి ఈ నెల 20వ తేదీన దిన్నెదేవరపాడు అంబేడ్కర్ గురుకులంలో ఉదయం 9 గంటల నుంచి డెమో ఉంటుందన్నారు. సెలెక్షన్ కమిటీ వారికి ఎంపిక/ రద్దు చేసేందుకు సర్వహక్కులు ఉన్నాయన్నారు. ఈ ఖాళీల్లో మార్పులు చేర్పులు డెమో జరిగే తేదీకి లోబడి ఉంటుందన్నారు. విద్యార్హతలు డీసీఓ కార్యాలయంలో గమనించాలని, నమూనా దరఖాస్తులను కార్యాలయంలో పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 08518– 295601 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నూతన విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మీదేవి

కర్నూలు(అర్బన్): 2024–25 విద్యా సంవత్సరానికి నూతన విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మిదేవి అన్నారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో వసతిగృహ సంక్షేమాధికారులు, సహాయ సంక్షేమాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 13న జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలన్నీ పరిశుభ్ర వాతావరణంలో పునః ప్రారంభం కావాలన్నారు. హాస్టళ్ల ప్రాంగణాలు, గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి ట్యాంకులతో పాటు వినియోగ ప్రాంతాలన్నింటినీ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాలు, ఎస్సీ కాలనీలను సందర్శించి హాస్టళ్లపై విస్తృత ప్రచారం నిర్వహించి ఎస్సీ విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. రిజర్వేషన్ ప్రకారం ప్రతి వసతి గృహంలో ఆయా కేటగిరీల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి రెన్యూవల్స్ పూర్తి చేసి ఫ్రెష్ అడ్మిషన్లను జూలై 31 నాటికి పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా జూలై 31వ తేదీ నాటికి హాస్టల్ అడ్వైజరీ కమిటీ సమావేశాలను పూర్తి చేయాలన్నారు. విద్యార్థి హాస్టల్‌లో ప్రవేశం పొందిన రోజే జేఎస్‌బీ నివాస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అన్ని వసతి గృహాల్లో వంద శాతం బయోమెట్రిక్ హాజరు ఉండాలన్నారు. సమావేశంలో సహాయ సంక్షేమాధికారులు సుధాకర్, మద్దిలేటి, లీలావతి, కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి

చిప్పగిరి: ప్రమాదవ శాత్తు నీటి కుంటలో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ విషాద సంఘటన మంగళవారం మండలంలోని సంఘాల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహానంది, గాయత్రి దంపతులకు ఐదుగురు సంతానం. నలుగురు కుమార్తెల తర్వాత కుమారుడు అనిల్ జన్మించాడు. దీంతో కుటుంబసభ్యులు ఈ చిన్నారిని ఎంతో అల్లారు ముద్దుగా చూసుకునే వారు. అనిల్ మంగళవారం ఉదయం ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో తల్లి దండ్రులు గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికి స్థానిక బీసీ కాలనీలోని నీటి కుంటలో బాలుడు శవమై కనిపించాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

క్వాలిటీ కంట్రోల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి

- శాంపిల్స్ ఫెయిల్ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి
- ఏఓ, ఏడీలకు జిల్లా వ్యవసాయ అధికారి సూచనలు

కర్నూలు (అగ్రికల్చర్): ఎరువులు, పురుగు మందులు, విత్తనాల క్వాలిటీ కంట్రోల్‌పై మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక ఉద్యాన భవన్‌లో ఏఓలు, ఏడీఏలకు క్వాలిటీ కంట్రోల్‌పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, కర్నూలు మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఏఓ టార్గెట్ ప్రకారం శాంపిల్స్ సేకరించి ప్రయోగశాలకు పంపాలని, అవి ఫెయిల్ అయితే ఎలా ముందుకు సాగాలనే దానిపై వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఏఓ వరలక్ష్మీ మాట్లాడుతూ ఏఓలు, ఏడీఏలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు లేవని ధ్రువీకరణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, సాంకేతిక ఏఓలు అల్లీ పీరా, రాఘవేంద్ర, శారదమ్మ, అనురాధ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



దేవాంగన పిల్లి



వివిధ కప్పజాతులు



ఉడుత



కొండచిలువ

అదిగో బెబ్బులి..ఇదిగో చిలక

- ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో కనువిందు చేసే సజీవ శిల్పాలు

గాండ్రిస్తూ కనిపిస్తున్న పెద్దపులి, చెట్టు ఎక్కి చూస్తున్న రామచిలుక, గంతుతున్న కప్పలు, ఉడుత, దేవాంగన పిల్లి ఇవన్నీ బొమ్మలే. దగ్గరకు వెళ్లి టచ్ చేస్తే తప్ప గుర్తుపట్టలేం. వాటిని అలా తీర్చిదిద్దారు శిల్పులు. సృష్టిలో ప్రతి జీవి ముఖ్యమే. ఏ ఒక్కటి విలుప్తమైన మానవజాతి మనుగడకే ముప్పు. ఈ సత్యాన్ని ఆవిష్కరిస్తూ అధికారులు ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో బైర్లూటి ఎకో – టూరిజం రిసార్ట్, నల్లకాల్వ శివార్లలో ఉన్న వైఎస్ఆర్ స్మృతివనంలో అనేక వన్యప్రాణులు, పాములు, క్రిమికీటకాదుల శిల్పాలను ఏర్పాటు చేశారు. నాగపూర్‌కు చెందిన శిల్పులు ఫైబర్‌తో తయారు చేసిన ఈ కళా రూపాలు జంతు ప్రేమికులను, పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి.

–ఆత్మకూరురూరల్



పెద్దపులి



రామచిలుక